



"మే ఐ కమిన్, డాక్టర్?" అని బదులుకు ఎదురు చూడకుండా నవ్వుతూ వెళ్ళి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది లత. లత ఉమాపతి చెల్లెలు. 'మెడిసిన్' చదువుతూంది.

". . ."

పలచగా సిగరెట్ పొగ గదినంతా ఆక్రమించుకుని ఉంది. డాక్టర్ ఉమాపతి గోడకు అభిముఖంగా నిలబడి, దేన్ని గురించో లోతుగా ఆలోచిస్తున్నాడు

"ఈ వేళేమో డాక్టరుగారి 'మూడ్' బాగా లేనట్టుంది." మళ్ళీ తనే పలకరించింది.

ఒక్క రోజు తనని చూడకుండా ఉండలేని అన్నయ్య, తను నాలుగు రోజుల తరవాత కనిపిస్తే కురిపించే గారాలకు తను ఉక్కిరి బిక్కిరై పోతానేమోనని అనుకొన్న లతకు ఉమాపతి ధోరణి కొంత ఆశ్చర్యాన్ని, కొండంత నిరాశను కలిగించింది.




రెక్సోనా - లెనోలిన్‌తో - మీ చర్మసౌందర్యం కోసం

హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

లింటాస్-RX. 67-140 TL

రెండవసారి పలకరింపుకి ఈ లోకంలోకి వచ్చి పడ్డాడు.

సిగరెట్ ఆఖరు దమ్ము లాగి ఆష్ ట్రేలో పడేస్తూ తాపీగా అన్నాడు:

"యు ఆర్ కరెక్ట్. ఐ యామ్ రియల్లీ అప్‌సెట్. . . నిన్నటి రోజు పిచ్చి వచ్చింది. వచ్చింది మొదలుకొని వేధిస్తోంది, బెజవాడ సంబంధం చూసి రమ్మని. నీ కోసమే ఆగాను."

'నాకు ఇప్పుడే పెళ్ళి చేసుకోవాలని లేదు. నా చదువు పూర్తికానీ. తరవాత ఆలోచిద్దాం' అని లత అనలేదు.

ఆ అనవలసిం దేదో పెళ్ళిచూపులకు ముందే అనింది. కానీ, పిచ్చి వినిపించుకుంటేగా? అందుకే తను ఇప్పుడు ఏమీ అనదలుచుకోలేదు.

• • •

"ఇడే మా నరేంద్ర" అన్నారు శ్రీపతిగారు, టీపాయ్ మీది ఫోటో ఉమాపతికి అందిస్తూ.

"నరేంద్ర అదృష్టజాతకుడనే చెప్పాలి. వాడు పుట్టిన వేళావిశేషం — ఆరు నూరయింది నేను ఇంతటి వాణ్ణి అయ్యాను!

మా వాడి గురించి నేను చెప్పడం అంత బాగుండదు. అయినా ఏ మాట కా మాటే చెప్పాలి. సభ్యత, సంస్కారాలకు మా వాడు మారుపేరు!

మా వాడిలో ఇంకో 'స్పెషాలిటీ' ఉంది. మనకు లక్షలున్నాయి కదా అని కించిత్తు గర్వపడడు. ఒక్క మాటలో చెప్పాలంటే, మా నరేంద్ర ఈ భూమిమీద పుట్ట వలసిన వాడు కాడు!

ఇంకా మా వాడు. . ."

ఇంతలో బయట కారాగిన చప్పుడైంది.

బాగా వినపడుతూంది.

తియ్యని గొంతులు కొన్ని 'గుడ్ నైట్' పలికాయి.

తరవాత 'కింకిలా' నవ్వాయి.

కారు వెళ్ళిన చప్పుడైంది మరు క్షణం.

ద్వారం దగ్గర 'ది గ్రేట్' నరేంద్ర తూలుతూ కనపడ్డాడు. అంతే!

తోక తొక్కిన పాములా లేచాడు ఉమాపతి.

"చెప్పరేం? ఎందు కాపేశారు? చెప్పండి! ఇంకా మీ వాడు ఏమేం రాచ కార్యాలు వెలగబెడతాడో చెప్పండి! ఏం? . . . ఇప్పుడు చెప్పుకోవడానికి నామోషీగా ఉందా?

డబ్బుని ఎరగా చూపెట్టి అందమైన అమ్మాయిల్ని (అమాయకుల్ని) బుట్టలో వేసుకోవడం మీ వాడిలోని 'స్పెషాలిటీ' అని, తప్ప తాగి గుడ్లు తేలెయటం మీ వాడిలోని 'నావెల్టీ' అని ఇప్పుడు చెప్పరేం?

ఓహో! వెయ్యి అబద్ధాలయినా చెప్పి ఒక పెళ్ళి చెయ్యాలనటాన్ని అక్షరాలా పాటిస్తున్నారన్న మాట! అబద్ధాలు చెప్పినా, అవి ఎదటివారి బ్రతుకులో నిప్పులు చెరిగేవిగా మాత్రం ఉండ కూడదు. ఇంకా చెప్పాలంటే మీ వాడి కున్న రోగానికి 'పెళ్ళి' ఒక మందు కాదు. వస్తా. గుడ్‌లక్!" అని విసురుగా వెళ్ళి పోతున్న ఉమాపతి కేసి మాటలు రాని వాడిలా గుడ్లప్పగించి చూస్తూండి పోయారు శ్రీపతిగారు.

కొంత దూరంలో నరేంద్ర మేడ మెట్ల దగ్గర నిలబడి తను ఇప్పుడు ఎక్కాలా? దిగాలా? అని తేల్చుకోలేని పరిస్థితిలో ఉన్నప్పుడు గోడ గడియారం గుండెలవిసిపోయేలా పది సార్లు మ్రోగింది

• • •

9—1—75

"మాధవరావుగారూ,

మీ ఉత్తరం అందింది. పార్కుకి రమ్మని వ్రాశారు. క్షమించండి. పెళ్ళికి ముందు ప్రేమలో నాకు అట్టే నమ్మకం లేదు.

మీకు అంతగా నన్ను పెళ్ళి చేసుకోవా లని ఉంటే, మా అన్నయ్యతో కలిసి మాట్లాడగలరు.

ఆదివారం సాయంకాలం మీ కోసం ఎదురుచూస్తూంటాడు మా అన్నయ్య.

ఇట్లు,
—లత."

## ఎ. ఎస్. వేణుగోపాల్

మాధవరావు చేతిలోని ఉత్తరాన్ని ఉండ చేసి కసిగా గిరాటేశాడు.

చాలామందిని ఓడించిన మాధవరావ్ జీవితంలో మొదటిసారిగా ఓడిపోయాడు.

పూర్ ఫెలో, మాధవరావ్! అవమానం భరించలేక పోతున్నాడు.

మాధవరావుకు అన్యాయం జరిగి పోయింది.

మాధవరావుకువెళ్ళాలనిలేదు. అయినా బయలుదేరాడు. వెళ్ళకపోతే తను 'రోడ్ రోమియో' అని తేలిపోతుంది. కట్నం దగ్గర పేచీ? వెరీ గుడ్!

ఆ మాటే అన్నాడు స్నేహితుడు గుర్నాథంతో.

"ఆ సంగతి నా కొదిలెయ్యి, గురూ!" గుర్నాథం హామీ ఇచ్చాడు.

గుర్నాథం, మాధవరావు కలిసి వెళ్ళేటప్పటికి ఉమాపతి 'లాన్'లో కుర్చీలో కూర్చుని ఉన్నాడు.

లేచి వచ్చి సాదరంగా ఆహ్వానించాడు.

పరిచయా లయ్యాయి.

"లత చెప్పింది, మీగురించి" అన్నాడు ఉమాపతి, మాధవరావుని ఉద్దేశించి.

మాధవరావు చిన్నగా నవ్వి, గుర్నాథం కేసి చూశాడు.

"మావాడుచాలామొహమాటస్తుడు" అన్నాడు గుర్నాథం.

ఆ తరవాతకూడా ఉమాపతి అడిగిన ప్రతి దానికీ గుర్నాథమే వకాలతు పుచ్చుకొన్న లాయర్‌లా మాట్లాడాడు.

"మీ రేమైనా అడగ దలుచుకుంటే అడగచ్చు" అన్నాడు ఉమాపతి.

"ఆ మాటకూడా మీరే చెప్పేస్తే బాగుంటుంది" చేతులు నలుపుకుంటూ అన్నాడు గుర్నాథం.

"ఏ మాట? !"

"అదే. . . కట్నం సంగతి. . ."

కాస్సేపు మౌనం వహించి, "మీరే చెప్పండి, ఎంత ఇవ్వాలో" అన్నాడు ఉమాపతి.

"మా వాడు చదువులకే పాతిక వేలు ఖర్చు పెట్టి ఉంటాడు. ఆ మాత్రం ఇస్తే చాలు. హీ ఈజ్ రియల్లీ ఎ డిజర్వింగ్ పెర్సన్. మీకుకూడా ఆ మాత్రం స్తోమతు లేకపోలేదు. . ."

"ఐయామ్ సారీ, మిస్టర్ గుర్నాథం. చాలా తక్కువ చెప్పారు. నాకో 'ఖరీదైన మనిషి' కావాలి. ఖరీదైన మనిషి!" అంటూ లేచాడు ఉమాపతి.

• • •

27—1—75

"ఉమాపతికి స్నేహితుడు వ్రాయునది:

ఇక్కడ మూర్తి అని నా స్నేహితుడు పెళ్ళిచూపుల కని వెళుతూ నన్ను రమ్మన్నాడు. ఇలాంటి వాటికి ఒక మధ్య వర్తి అవసరం కదా? అందుకే వెళ్ళొచ్చాను. వచ్చిన వారం రోజుల తరవాత మూర్తి కనిపించాడు.

'ఉత్తరం వచ్చిందా?' అడిగాను.

'ఆఁ.' నిర్లిప్తంగా అన్నాడు.



'ఏమని? !'

శూన్యంలోకి చూస్తూ, 'అమ్మాయికి అబ్బాయి నచ్చలేదని' అన్నాడు.

సమాధానం విని చకితుణ్ణయ్యాను. కారణం— వాళ్ళు ఒకర్నొకరు అంతగా ప్రేమించుకున్నారు. పెళ్ళిచూపులు నామ మాత్రమే.

'అంటే?' అన్నాను.

'అదే నాకూ తెలియడం లేదు.'

నా కేదో స్ఫురించినట్లయి ఆ సంగతేదో నేను కనుక్కుంటాను. నువ్వు నిశ్చింతగా ఉండు! అని చెప్పి బయలు దేరాను.

రెండు రోజులు తిరిగి, విసిగి వేసారి చివరికి ఏలాగైతేనేం, వాళ్ళింట్లో పని చేసే నౌకరు ఇల్లు కనుక్కో గలిగాను.

నన్ను 'ఫలానా' అని గుర్తు పట్టినట్లుంది.

'రండి, బాబూ!' అంటూ లోనికి దారి తీశాడు.

నులకమంచం మీద కూర్చుంటూ, 'మీఅయ్యగారుసంబంధం నచ్చలేదంటూ ఉత్తరం రాశారు. దీని గురించి నువ్వేమైనా చెప్పగలవా?' అని అడిగాను

'సంబంధం నచ్చక పోవడ మేమిటి, బాబూ! మీరు కట్నం అవీ బొత్తిగా వద్దనీ, పైగా పెళ్ళి ఖర్చులుకూడా సగం భరించగలమనీ అన్నారట. దానితో వాళ్ళకు లేనిపోని అనుమానం మీ మీద. ఇందులో ఏదో 'కుంభకోణం' ఉందంటు న్నారు.

అంతేగాక మీరు పెళ్ళికూడా తిరుమల కొండమీద సింపుల్‌గా జరగాలని అన్నారట. ఇదేదో అల్లాటప్పా వ్యవహారం కాకపోతే గుళ్ళో పెళ్ళేమిటి? అంటున్నారు.

బాబూ! ఇక్కడి వాళ్ళు కట్నం అడగని వాళ్ళని చాలా చులకనగా చూస్తారు.

దైవసన్నిధిలో పెళ్ళి జరగటం ఎంత భాగ్యమో ఈళ్ళకేం తెలుస్తది. బాబూ!' అని ఇంకా ఏమేమో చెప్పుకొచ్చాడు... ఇక్కడ 'కట్నం' లేనిదే పెళ్ళి జరగదని, ఉద్యోగాన్ననుసరించి ఇంటిపేరులా 'రేట్లు' ఉన్నాయని, ఆడపిల్లలున్న వాళ్ళ గతి ఇహ 'అంతే' నని, మగపిల్లలే అయితే 'లక్కీ' అని, మధ్యవాళ్ళలో ఉంటే 'చలేగా' అని, పిల్లలు లేని వాళ్ళ పని 'హాయ'ని, ఆస్తి ఉన్నవాడికి 'ఇంకంత' ఆస్తని, లేని వాళ్ళకు దారి 'గోదారే' నని.

ఉమాపతీ! భలేగా ఉంది కదూ ఈ సంతబేరం? మనం పుస్తకాల్లో బానిసల్ని డబ్బిచ్చి కొనుక్కునే వాళ్ళని మాత్రమే చదివాం. చూడబోతే ఈ సంఘంలో ఆడది ఒక 'వింత బానిస' అనిపిస్తోంది. జీవితకాలం తనతో 'బ్రతుకుబండి' లాగా లని వచ్చే సాటిమనిషి, ఇంకంత డబ్బుని కూడా పట్టుకు రావాలనుకోవడం 'వింత' కాకపోతే ఘరేమవుతుంది?

ఈ సమాజాన్ని సృష్టికర్త కూడా ఉద్ధరించలే డనిపిస్తోంది. ధనం చేయ గలిగిందల్లా ఎవరి ఖర్మకు వాళ్ళని వది లెయ్యడమే!

ఎందుకో ఇంక అక్కడ ఒక క్షణం కూడా ఉండ బుద్ధి వెయ్యలేదు.

బస్సు దిగి మూర్తి ఉంటున్న గది వైపు నడిచాను.

మేడమెట్లు ఎక్కుతుండగా ఎవరిదో పరిచయమైన గొంతులా ఉంది ... విరగబడి నవ్వుతున్నారు. గొంతును బట్టి పోల్చుకున్నాను— కాంతారావే!

తలుపులు తెరిచే ఉన్నాయి. గదిలో అడుగు పెట్టగానే అక్కడ దృశ్యం చూసి కొయ్యబారి పోయాను.

అప్పటికే సగం బాటిల్ ఖాళీ అయి నట్టుంది. మూర్తి ఏదో అంటున్నాడు. కాంతారావు నవ్వుతూ నన్ను చూసి ఆపేశాడు. మూర్తి తల దించేసుకున్నాడు.

ప్రయాణం వల్ల నీరసించి ఉన్నా నేమో, ఒళ్ళు తెలియని ఆవేశంలో సరాసరి మూర్తి భుజాలు పట్టుకుని ఊపేశాను.

'మూర్తీ! ఏమైంది నీకీ రోజు? ! దేవదాసులా నువ్వూ, నీ తాగుడూను! ఇదంతా వీడి పనే అయ్యుంటుంది' అంటూ వెనక్కి తిరిగాను. అప్పటికే జారుకున్నట్టున్నాడు కాంతారావు వెధవ! వెధవ! బ్రతికిపోయాడు!

కూజాలోని నీళ్ళు వంచుకుని గటగట త్రాగేశాను.

''ఈ సారికి మన్నించు. ఇక ముందిలా జరగదు' అన్నాడు మూర్తి, కిటికీ ఊచలు పట్టుకుని చీకటిలోకి చూస్తూ.

సమయానికి నేను వచ్చాను కాబట్టి సరిపోయింది. లేకపోతే ఆ రాత్రికి మూర్తిని ఏ 'రాణివాసాని'కో లాక్కెళ్ళేవాడే కాంతా రావు!

ఆ మాటే అన్నాను మూర్తితో?

'అది సరేగానీ, నువ్వెళ్ళిన పనేమయింది మాట మార్చాడు. అన్ని విషయాలూ చెప్పి, 'మీరు తెగించి ప్రేమించుకున్నారు. ఇప్పుడు తెగించి రిజిస్ట్రీ మారేజికూడా చేసుకోండి. అదొక్కటే దారి' అన్నాను.

ఆ మాటలు అన్నది నేనే అయినా, మూర్తి అంత పనీ చేసి, ఓ సాయంకాలం నా ముందు భార్యా సమేతంగా వచ్చి నిలుచునేటప్పటికి నా కళ్ళను నేనే నమ్మ లేకపోయాను.



ఫోటో— ఎస్. సుబ్బారావు

ఇప్పుడు మూర్తికి జీవితం ఒక రంగుల స్వప్నం. మూర్తి మునుపటి కన్నా హుందాగా, హుషారుగా ఉన్నాడు. ఇన్నాళ్ళూ అర్ధ గంట ముందే కోర్టుకు హాజరయ్యే మూర్తి, ఇప్పుడు టంచనుగా టైముకు కొస్తున్నాడు. వచ్చింది మొదలు భార్యకు చీరలు కొనాలనో, పార్కు కెళ్ళాలనో, కొత్త సినిమా వచ్చిందనో అంటూంటాడు.

పెళ్ళి చేసుకోరా అంటాడు. 'వైఫ్ లైఫ్' అంటాడు. 'లైఫ్ బిజీ' అంటాడు. సాయంకాలం అయిదింటికల్లా రాధ ఒంటరిగా ఉంటుంటాడు. 'గుడ్‌నైట్' అంటాడు. స్కూటరెక్కి పరారైపోతాడు.

కోర్టు ఆవరణలో నేను ఒంటరిగా మిగిలిపోతాను. ఏ మూలో పొంచి ఉన్నట్టు 'క్లయింట్లు' వచ్చి నన్ను చుట్టుముట్టే స్తారు. వాళ్ళకు సమాధానం చెప్పలేక నేను ఒడిపోతుంటాను.

ఇది కొన్నాళ్ళుగా నిత్యం జరుగుతున్న సత్యం.

ఇది అసూయ ఏమాత్రం కాదు. నాకు అనిపిస్తోంది—మూర్తి ఒక్కడి తోనే 'క్లోజ్'గా 'మూవ్' అయినందు వల్ల వాడు లేనప్పుడు 'వెలితి' నాకు కొట్టవచ్చినట్టు కనిపిస్తోందని.

సరిగ్గా ఇలాంటి తరుణం లోనే లత ఇక్కడికి వచ్చింది. ఉన్న నాలుగు రోజులూ అంటీ అంటనట్టు దూరం దూరంగా తప్పించుకుని తిరిగింది. మాటలుకూడా ముక్తసరిగా ఏవో రెండు మాటలు చెప్పింది. అవికూడా వాళ్ళ స్నేహితురాండ్ర గురించే! స్నేహితురాండ్రే తన సర్వస్వం అయితే, వాళ్ళనే కట్టుకుని ఊరేగమను. నేను అంతా గమనించాను. బోడి సినిమాలేవో వాళ్ళతోనే చూడాలా?

లతను బస్సెక్కించడానికి వెళ్ళి నప్పుడు చూశాడేమో కొట్టువాడు— బాగుందంటూ బలవంతంగా రెండు చీరలు అంటగట్టాడు. ఇక్కడ వాటిని నే నేం చేసుకోను? అందుకే దీనితో జతచేసి పంపుతున్నాను.

ఇక్కడ నీకు ఇంకో విషయం చెప్పాలి. 'పెళ్ళి చేసుకోకూడదు' అని నాకు ఇదివర కున్న అభిప్రాయాన్ని మార్చుకున్నాను. అంతేకాదు, ఇదివరకున్న మన స్నేహాన్ని బంధుత్వంగా 'ప్రమోట్' చేయడానికి కూడా నిశ్చయించుకున్నాను.

ఇట్లు,
—వేణు.''

ఉత్తరం చదివి లోలోన నవ్వుకున్నాడు ఉమాపతి, కాదంటే ఔననీ, ఆడవారి మాటలకు అర్థాలు వేరనీ, ఆమాత్రం వేణు తెలుసుకోలేదే అని. ★